క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



కొల్లికూళ్ల, వెల్లుర్తిపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని కొల్లికూళ్ల, వెల్లుర్తిపాడు గ్రామాల్లో అమ్మ, నాన్న సోషల్ సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయాన్ని చేయటం ద్వారా సంతృప్తి పొందుతారన్నారు. సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మరింత కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డోర్నాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



పెనుగంచిప్రోలు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక మునేరు అవతల బుధవారం చోటుచేసుకుంది. ముచ్చింతాల గ్రామానికి చెందిన అంగజాల వెంకటరావు ద్విచక్ర వాహనంపై పెనుగంచిప్రోలు వైపు నుంచి వెళ్తూ అమ్మవారి మామిడి తోటల వద్ద వరదలతో మార్జిన్ కొట్టుకు పోయి ఏర్పడిన గుంతలో పడ్డాడు. ప్రమాదంలో వాహనం స్తంభానికి ఢీ కొని అతనికి తగలకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. 108 వాహనంలో ఆయనను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తక్షణమే తోట పక్కన మార్జిన్ పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మక్కపేట(వత్సవాయి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ సి.భవాని తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గత 11 రోజులుగా జాతీయసేవ పథకంలో భాగంగా గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఇంటి ముందు ఉన్న సైడ్ కాలువలను శుభ్రపరుచుకుని మురుగునీరు పారేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కాలువల్లో దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, కేవీకే కో ఆర్డినేటర్ అచ్యుతరాజు, శాస్త్రవేత్తలు వి.సీతారాంబాబు, ఎస్.జస్వంత్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్, జి.శోభితారాణి, శివప్రసాద్, ప్రభావతి పశువైద్యాధికారి కె.శ్రీరాములు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం, నాగేశ్వరరావు, గోళ్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాశాంతి హోమాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్రశుద్ధి, అగ్నిధ్యానాలు, సర్వదేవత ఆహ్వానం, ప్రధాన, మహాశాంతి హోమాలను ప్రధాన అర్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ కేటీఎస్ వరప్రసాద్, అర్చకులు చక్రపాణి, గోపాలాచార్యులు, లక్ష్మీనరసింహా చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా చెత్త తొలగింపు



కంచికచర్ల: మండలంలోని గండేపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు చేపట్టినట్లు సర్పంచ్ బొక్కా రవికుమార్ బుధవారం తెలిపారు. గ్రామంలో శ్మశాన వాటిక వెళ్లే రోడ్డు పక్కన డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని జేసీబీ సాయంతో తొలగించామన్నారు. గ్రామ వీధుల్లో కాల్వల్లో మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతేకాకుండా బ్లీచింగ్, సున్నం చల్లించామని దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచికారీ చేయించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న ఉచిత ఇసుక

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- అధికార పార్టీ నాయకులు చెప్పిందే నిబంధన
- వారి ఆశీస్సులతో యథేచ్ఛగా అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



నందలూరు ఇసుక రీచ్‌లో యంత్రంతో ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న సిబ్బంది

వీరులపాడు: పేద ప్రజల కోసం ప్రకటించిన ఉచిత ఇసుక అక్రమార్కులకు వరంగా మారుతోంది. నిత్యం యంత్రాలతో వందల సంఖ్యలో వాహనాల్లో ఇసుక తరలిస్తున్నా అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక మాఫియా ఇచ్చే మామూళ్ల మత్తుతో ఆయా శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని నందలూరు గ్రామంలో ఇసుక అక్రమ రవణా జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించటం లేదు. పేదలకు అందాల్సిన ఉచిత ఇసుక పక్కదారి పడుతున్నా ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు సర్వత్రా నెలకొన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలు..

ఉచిత ఇసుక రీచ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలు వినియోగిస్తున్నా అడిగే వారు లేరని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. నిబంధనల మేరకు ట్రాక్టర్లకు కూలీలు లోడ్ చేయాలనే ప్రభుత్వ నిబంధనలను సైతం అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఆశీస్సులతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పగటి సమయాలలో ట్రాక్టర్‌లతో నిబంధనలకు విరుద్ధంగా లోడ్ చేసి నిర్మానుష్య ప్రాంతాలలో డంప్ చేస్తున్నారు. ఆ తరువాత రాత్రి వేళల్లో లారీలతో రాష్ట్రాలు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యులు ఒక ట్రక్కు ఇసుక తోలితే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు అక్రమార్కులకు మాత్రం కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నేతలకు కాసుల పంట..

నందలూరు గ్రామంలోని ఇసుక రీచ్‌లో ప్రభుత్వ నిబంధనలు కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన నిబంధనల మేరకే ఇసుక తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ పనుల పేరుతో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇసుక లోడ్ చేస్తున్నారని అలా కాదని ఎవరైనా ఎదురు తిరిగి మాట్లాడితే భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఒక పక్క యంత్రాలతో లోడ్ చేస్తున్నప్పటికీ మరో పక్క కూలీలతో లోడ్ చేయిస్తూ కూలీలకు రూ. 400లు చెల్లిస్తే తమకు రూ. 200 చెల్లించాల్సిందేనని అలా కాకుంటే ఇసుక లోడ్ చేసేది లేదని తెగేసి చెబుతుండటంతో ఏం చేయాలో తెలియటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదాల పరిష్కారానికే
రెవెన్యూ సదస్సులు



గండేపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

గండేపల్లి(కంచికచర్ల): రైతుల భూముల్లో భూ వివాదాలకు తావులేకుండా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పి.జాహ్నవి పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ.. భూముల సర్వే నంబర్లలో కొలతలు, హద్దులు తేడాలు ఉంటే రైతులు అర్జీలు అందజేయాలన్నారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాలు, కొలతలు, హద్దులు తదితర సమస్యలపై 10 అర్జీలు అందాయన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలోపరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా రవికుమార్, డీటీ మానస, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వీఆర్వో రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 23 దరఖాస్తులు..

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. అటవీ, దేవాలయ భూముల సమస్యలు ఉన్న పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అనంతరం 23 మంది రైతులు సర్వేలో లోపాలున్నాయంటూ దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సూరమ్మ, డీటీ రాధిక, మండల సర్వేయర్ అనూష్‌బాబు, సర్పంచ్ రామకృష్ణ, రెవెన్యూ, దేవదాయ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బంజర భూమిలో ఆక్రమణలను తొలగించాలి..

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు, రంగాపురం, తిమ్మాపురం గ్రామాల మధ్య ఉన్న వందలాది ఎకరాల బంజర భూమిని సర్వే చేసి, ఆక్రమణలను తొలగించాలని సీపీఎం నాయకులు, ప్రజలు తహసీల్దార్ హుస్సేన్ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గడిచిన 80 ఏళ్ల నుంచి గ్రామంలోని 6.82 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని ఆ భూమికి చెందిన పాసు పుస్తకాలను మంజూరు చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా గ్రామ సమీపంలోని 600 ఎకరాల వేమకుంట బంజరు భూమిలోని ఆక్రమణదారులను తొలగించి సాగు చేస్తున్న పేదలకు పట్టాలు అందించాలని సీపీఎం నాయకులు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామన్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ రంగాపురంలో వన సంరక్షణ సమితి బకాయిలను రూ.8 లక్షలు విడుదల చేయాలని, వీఎస్ఎస్‌ను అభివృద్ధి పర్చాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని గుర్తించి సాగుదారులకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు, గ్రామ నాయకులు కాపు రాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి చాట్ల రవి, షేక్ లాల్ అహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికునికి ఆర్థిక సాయం



గంగరాజుకు నగదు అందజేస్తున్న జేఏసీ సభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి పట్టణ సమీపంలో ఉన్న జగ్గయ్యపేట లైమ్‌స్టోన్ మైన్స్ గత నెల 29న విద్యుదాఘాతంతో గాయపడిన పాగిలి గంగరాజుకు జాయింట్ యాక్షన్ కమిటీ జేఎల్ఎం వారు రూ.1.41 లక్షల నిధులు సేకరించి ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం యూనియన్ నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జేఎల్ఎంలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు కాంట్రాక్టర్ 8 నెలల నుంచి జీతాలు ఇవ్వక భద్రత సామగ్రి ఇవ్వకపోవడం, మెడికల్ ఇన్సూరెన్స్ కట్టలేదన్నారు. వీటితో పాటు అనేక లోపాలను దాచిపెట్టి కార్మికుల ఆరోగ్యం, భద్రత విషయంలో కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తుంటే ఇక్కడ ఉన్న యాజమాన్యం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా పరిస్థితిని చక్కపెట్టాలని, లేదంటే కార్మికులంతా కలిసి త్వరలోనే అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. బాధితునికి తక్షణ సహాయం, పూర్తి ఆరోగ్యంతో కోలుకునే వరకు అయ్యే పూర్తి ఖర్చును కాంట్రాక్టర్ భరించాలని, లేదంటే అతనిపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేసిన తోటి కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ నాయకులు విశ్వాసరావు, కంపా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ప్రసాద్‌బాబు, రామచంద్రనాయక్, రాంప్రసాద్, దేవోజీ, హేమనాయక్, జోమీ థామస్, సురేష్, భాస్కర్, భూపతి, వెంకయ్య పాల్గొన్నారు.

5వ వార్డులో వీధిలైట్లకు మోక్షం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్(కమ్యూనిటీ హాల్) పరిసరాల్లో కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంతంలోని వేపలవాగు బ్రిడ్జి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మున్సిపల్ లేఅవుట్ స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు 5వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ దృష్టికి తీసుకువచ్చారు. పరిస్థితి తీవ్రతపై స్పందించిన ఆయన బుధవారం మున్సిపల్ ఏఈతో మాట్లాడి 6 వీధి లైట్లు సదరు ప్రాంతానికి వెళ్లి దగ్గర ఉండి వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో స్థానికులు, 1,2 సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు నరేష్, బాలాజీ, మున్సిపల్ ఉద్యోగి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రమణబాబు

నందిగామటౌన్: పట్టణంలోని 20 వార్డుల పరిధిలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పశువుల ఆస్పత్రి వద్ద డ్రెయినేజీ బ్లాకై మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందన్నారు. వెంటనే పూడిక తీయించటంతో పాటు ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. చెత్త, చెదరాలను ఎక్కడ పడితే అక్కడ వేయటం వల్ల డ్రెయిన్లలోకి చేరి మురుగు నీరు పారుదల కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెత్త, చెదరాలు, వ్యర్థాలను రోడ్డుపై పడేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలన్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 14న జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని 18 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 14న ఉదయం 8 గంటలకు సభ్యులను ఎన్నుకునేందుకు సమావేశం ఏర్పాటు చేయడం, ఉదయం 9 గంటల నుంచి 9.15 వరకు ఓటర్లకు నీటి వాడకం దారుల ప్రధాన ఉద్దేశాలను వివరించడం, ఉదయం 9.15 నుండి 9.45 వరకు ఏకాభిప్రాయం లేని చోట ఓటర్ల ఎంపికను చేతులెత్తి ప్రదర్శన ద్వారా లేదా ఓటింగ్ స్లిప్పుల ద్వారా తెలుసుకోవడం, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తారు. ఉదయం 9.45 నుంచి 10.30 వరకు అభ్యర్థుల పోటీదారుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం సభ్యులను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఫలితాల ప్రకటన, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడానికి ప్రత్యేక యాజమాన్యం కమిటీ సమావేశం జరుగనున్నట్లు అన్ని గ్రామ సచివాలయాల్లో నోటిఫికేషన్ జారీ చేశారు.

ఎల్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. శిక్షణా కేంద్రంలో చేరేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సీ ప్లస్ 2, డిగ్రీ ఆపైన ఉత్తీర్ణులై ఉండాలని, డిసెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అభ్యర్థులకు ప్రత్యేకంగా మూడు నెలలు డొమెస్టిక్ బయోమెట్రిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు డేటా ఎంట్రీ కోర్సులలో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిరుపయోగంగా
గ్రామ సచివాలయ భవనం

- సకల సౌకర్యాలతో నిర్మించిన భవనం
- 8 నెలలుగా ఖాళీగా ఉన్న వైనం
- పట్టించుకోని అధికారులు



చిల్లకల్లు-జగ్గయ్యపేట రహదారిలో నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అధికారుల అలసత్వం కారణంగా లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. వివరాల్లోకి వెళ్లే... గ్రామంలోని జగ్గయ్యపేటకు వెళ్లే రహదారిలో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం-1 భవనాన్ని అన్నిహంగులతో రెండు ఫ్లోర్లతో నిర్మించారు. 8 నెలల క్రితం భవనాన్ని అప్పటి శాసనసభ్యుడు సామినేని ఉదయభాను ప్రారంభించారు. అయితే భవనం ప్రారంభించి నెలలు గడుస్తున్నా నేటి వరకు అధికారులు భవనంలోకి వెళ్లేందుకు ఆసక్తి కనబర్చటలేదు. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న పాత గ్రామ పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. భవనంలో గదులు తక్కువగా ఉండటంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన భవనంలో విశాలమైన గదులు ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం అక్కడికీ ఎందుకు వెళ్లడం లేదో తెలియడం లేదు. ఇప్పటికే భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక పక్క మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రస్తుత కార్యాలయానికి వస్తున్నారు. అక్కడ అరకొర సౌకర్యాలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్యాలయంలోకి వెళ్లొచ్చుగా అని కొందరు అడుగుతుండటంతో అధికారులు మాట దాటవేస్తున్నారు.

త్వరలో నిర్ణయం తీసుకుంటాం..



నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంలో సిబ్బందికి ఇంకా కావలసిన మెరుగైన సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలన చేస్తాం. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకు వెళ్లి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

– జి.నితిన్, ఎంపీడీవో

పాడి రైతులకు బోనస్ పంపిణీ



మైలవరం: మైలవరం మండలం కొత్తగూడెం పాల కేంద్రంలో కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా 248 మంది పాడి రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, వేతన కార్యదర్శి బి. వెంకటరెడ్డి, సూపర్ వైజర్ వి. సురేష్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

తిరువూరులో బోనస్ అందజేత

తిరువూరు: తిరువూరు క్లస్టర్ పరిధిలోని లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో పాడి రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్లు బొట్టు రామచంద్రారావు, బోయపాటి సుశీల, ట్రస్ట్ సభ్యులు ఎం. విజయలక్ష్మి, పి. సత్యనారాయణ, ఏజీఎం అన్వేష్, మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ మొద్దు నిద్రను మేల్కొలిపేందుకే రైతుల ధర్నా

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు
- అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్ల ఆవిష్కరణ



అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై చలనం లేకుండా ఉంటూ ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రను మేల్కొలిపేందుకే రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు రైతులతో కలసి ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 13న విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉదయం 10 గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ నేతృత్వంలో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ధర్నాకు సంబంధించిన పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి తన్నీరు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరుబాట, అలానే రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం కోసం నిరసన కార్యక్రమం, ధర్నా, కలెక్టర్‌కు ఎన్టీఆర్ జిల్లాలో రైతాంగం పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఒక విజ్ఞాపన పత్రం తదితర కార్యక్రమాలను రూపకల్పన చేసి ఆ రోజు అధికారులకు అందజేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులందరూ పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు..

ప్రభుత్వం రైతుల పట్ల అవలంభిస్తున్న కఠిన వైఖరి వలన ధాన్యం రైతులు, పత్తి రైతులు, మిర్చి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే 70 శాతం రైతుల వద్దకు ధాన్యం వచ్చిందని, ప్రభుత్వం వారిని గిన్నీ బ్యాగులు, రవాణా సౌకర్యం, ఆరబెట్టుకోవడానికి సబ్సిడీపై పరదాలు ఇవ్వకపోవడం, తేమశాతంలో వెసులుబాటు లేకపోవడంతో దళారీలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అలాగే పత్తి 90 శాతం దళారీల చేతికి వెళ్లిన తరువాత సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇటీవల ఏర్పాటుచేశారని, దీనిపై గతంలోనే వైఎస్సార్ సీపీ పార్టీ సీసీఐలు ఏర్పాటుచేయాలని కోరిందని గుర్తుచేశారు. అలాగే మిర్చి మరొక 15 రోజుల్లో రైతుల చేతికి రాబోతుందని, రూ.10 వేల లోపే ధరతో దళారీలు కొంటున్నారన్నారు. కనీస మద్దతు ధర రూ.20 వేలు అయితేనే గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఈ ఉద్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి బాసటగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, పార్టీ జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కన్నమాల శామ్యూల్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహరెడ్డి, మన్నె అప్పారావు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలికి సత్కారం



నందిగామటౌన్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు అందుగుల సుశీల రెండు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు మరువలేనివని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లెపాక శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తూ సొంత పిల్లల్లా చూసుకున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఆమె నిస్వార్థ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవతి, శ్రీధర్, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.